క్లుప్తంగా

నేడు సింగిల్‌విండో కార్యాలయాలు ప్రారంభం

తెలకపల్లి: మండలంలోని పెద్దూరు, చిన్నముద్దునూర్ గ్రామాల్లో సింగిల్‌విండో కార్యాలయాలతో పాటు, గోదాంలను ఆదివారం ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోరటి వెంకటన్న, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, హాజరై ప్రారంభిస్తారని సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, చైర్మన్ ద్యాసాని భాస్కర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం సింగిల్‌విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లిలో శనివారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ భూమి పూజ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.10 లక్షలతో మంజూరైన రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులు నాణ్యవంతంగా నిర్మించాలని సూచించారు. వైస్ ఎంపీపీ ప్రణీత, శోభ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్ ఉన్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షికోత్సవం



అమ్రాబాద్: అమ్రాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని కళాశాల విద్యార్థులు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నారు. జెడ్పీటీసీ అనురాధ, ప్రిన్సిపాల్ సుధారాణిలు మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఉప్పునుంతల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ లెనిన్‌ను శనివారం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు వేర్వేరుగా సన్మానించారు. అదేవిధంగా నూతనంగా వచ్చిన తహసీల్దార్ తబితారాణిని బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కట్టా అనంతరెడ్డి, నర్సింహ్మారావు, రతన్‌సింగ్, కృష్ణ, శేఖర్‌గౌడ్, గోవింద్‌సింగ్ తదితరులు, బీఆర్‌ఎస్ నాయకులు కట్టా గోపాల్‌రెడ్డి, ఎల్లయ్యయాదవ్, శ్రీను, సుధాకర్, జంగయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన



తాడూరు: మండలంలోని పాపగల్, అంతారం గ్రామాల్లో వ్యవసాయ అధికారి సాయిరమేష్ రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో ఆశిస్తున్న చీడపీడల నివారణ, సాగుచేసే పద్ధతి వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. మొక్కజొన్నలో కత్తెరపురుగును గమనించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ కేజీబీవీ పాఠశాలలో బాలికలకు పండ్లు పంపిణీ చేశారు. మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ రాజు, ఎంపీటీసీ రవికుమార్, పాల్గొన్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం

- హరితహారానికి సిద్ధమవుతున్న నర్సరీలు



అంతారంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ ఏటా హరితహార కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 10వ విడత హరితహారం కోసం గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. మండలంలోని నర్సరీలలో మొక్కల పెంపకం ముమ్మరంగా సాగుతోంది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీలో ఒక నర్సరీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 1,82,368 మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 1,42,000 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా ప్రణాళికలు వేశారు. 24 నర్సరీలలో ఏర్పాటు చేసిన మొక్కల పెంపకాన్ని వాటి నిర్వహణ, వివిధ అంశాలను ప్రతి వారం మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. స్థల సేకరణ వందశాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ప్లాస్టిక్ బ్యాగులను సిద్ధం చేసి వాటిలో మట్టిని నింపి విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని నర్సరీలలో మొక్కలు కూడా ఏపుగా పెరిగాయి.

నర్సరీలో 10 వేల మొక్కలు..

గ్రామ పంచాయతీ నర్సరీలలో 10–12 వేల మొక్కలు పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీకి ఇప్పటికే మొక్కలను పెంచేందుకు ప్లాస్టిక్ బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు నాటడం పూర్తి చేశారు. వీటిలో వండ్రు, నల్లమట్టి, ఎర్రమట్టి, పశువులు ఎరువులు కలిపి నింపుతున్నారు. ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టిని కూలీల సహాయంతో నింపి టేకు, ఉసిరి, జామ, సీతాఫలం, వేప మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

పంచాయతీలదే బాధ్యత..

ఉపాధి హామీ పథకం కింద నర్సరీలను పెంచి వాటిని వర్షాకాలంలో నాటి సంరక్షించాలి. ఈ బాధ్యతను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అప్పగించింది. అలాగే ప్రతి ఇంటికి ఆరు మొక్కలు అందించి వాటిని జీపీ రికార్డులలో నమోదు చేయాలి. ప్రతి ఇంటా మొక్కలు నాటేందుకు వీలుగా పూలు, పండ్లు, టేకు, వేప తదితర మొక్కలను అధికంగా పెంచుతున్నారు. మొక్కల సంరక్షణలో గ్రామ పంచాయతీలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఉపాధి పొందుతున్న కూలీలు..

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహార కార్యక్రమం కోసం నర్సరీలలో చేపడుతున్న మొక్కల పెంపకంతో పలువురు కూలీలు ఉపాధి పొందుతున్నారు. నర్సరీలలో బ్యాగ్ ఫిల్లింగ్ పనుల కోసం 15 నుంచి 20 మంది కూలీలు పని చేస్తున్నారు. కూలీకి ప్రతి రోజు రూ.265 వరకు డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో నర్సరీలలో పని చేస్తూ కూలీలు ఉపాధి పొందుతున్నారు.

జూన్ వరకు పూర్తి చేస్తాం



మండలంలో 182000 మొక్కలను పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. మండలంలోని 24 పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం బ్యాగుల్లో మట్టిని నింపి విత్తనాలు నాటే కార్యక్రమం పూర్తి కావొచ్చింది. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం.

– గంగమోహన్, ఎంపీడీఓ

మొక్కలను రక్షించాలి..



నాటిన ప్రతి మొక్కను అధికారులు సంరక్షించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు నీటిని అందించాలి. మొక్కల చుట్టూ ట్రీగార్డు ఏర్పాటు చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలి.

– యాదయ్య, అంతారం

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయంలో శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ జైష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడికి భక్తులు తెల్లవారుజాము నుంచి నల్లటి వస్త్రాలతో జిల్లేడు పుష్పాలు, తిలతైలాభిషేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మసూత్ర శివలింగాన్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంత్, సాయి పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ అర్హత పరీక్ష

వెల్దండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశాల కోసం ఆదివారం 5వ తరగతి అర్హత పరీక్ష (టీజీసెట్) 2024 సంవత్సరానికి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షకీలా సుల్తానా పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావాలని కోరారు. అర్హత పరీక్షలకు 240 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



కందనూలు: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న జ్ఞాన సరస్వతి దేవాలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణం, అఖండ దీపారాధన గోపూజ, పుణ్యాహవాచనం, రక్షాధారణ, ఋత్విగ్వరణం, మండప ఆరాధన, పంచగవ్య ప్రాశనం, యోగిని మంటప, నవగ్రహ ప్రత్యేక పూజలు చేశారు. దొడ్ల రాజవర్ధన్ రెడ్డి, రాధా దంపతులు శాస్త్రోక్తంగా గణపతి హోమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఆదివారం సరస్వతి మాత అమ్మవారికి సామూహిక అభిషేక పూజలు ఉంటాయని, ఉదయం 10 గంటలకు నవగ్రహహోమం, గోశాలలో గోపద్మావ్రతం భక్తులచే సామూహికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉచిత అన్న ప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథం, కమిటీ సభ్యులు దొడ్ల నారాయణరెడ్డి, దొడ్ల ఇందుమతి, చంద్రకళ పాండురంగయ్య, వరలక్ష్మి, వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాముడు శనివారం రూ.5 వేలు ఆర్థికసాయం, క్వింటాల్ బియ్యం, గ్యాస్ సిలిండర్‌ను బాధిత కుటుంబానికి అందజేశాడు. కార్యక్రమంలో కుర్మిద్ద మాజీ సర్పంచ్ దామోదర్‌గౌడ్, రవిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్యాసుందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సర్వాది బాలయ్య నెల రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నాయకుడు ఎండీ బిక్కుసాయబ్ శనివారం రూ.5 వేలు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయండి



కొల్లాపూర్: ఈనెల 16 వతేదీన నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు కోరారు. శనివారం ఆయన పట్టణంలో సీఐటీయూ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. కార్మికులకు వ్యతిరేకమైన లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ్మా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు శివవర్మ, దశరథం, సలీం, రాజు ఉన్నారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

రుణమాఫీకి కేటాయింపులు ఏవీ?



వ్యవసాయ శాఖకు రూ.19,746 కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ నిధులు ఏ మూలకు సరిపోవు. రైతుబంధు ఎలా ఇస్తారు. రుణమాఫీ ఎలా చేస్తారు. బడ్జెట్‌లో రుణమాఫీ మాటలే లేవు. రుణమాఫీపై ప్రభుత్వం రైతులకు వివరణ ఇవ్వడంతో పాటు, మాఫీలు ఎలా చేస్తారో ప్రకటించాలి.

– గోవర్ధన్ రెడ్డి, రైతు సంఘం నాయకుడు

సామాన్యులకు మేలు చేసేలా ఉంది..



అన్ని వర్గాలకు న్యాయం చేసేలా బడ్జెట్ ఉంది. ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలతో పాటూ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేసేలా ఉంది.

– జూలూరు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



తాడూరు: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎంపీడీఓ గంగామోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు ఎంగంపల్లి, కొల్లాపూర్ గ్రామాలను సందర్శించారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు కలిసి గ్రామాల్లోని అన్ని వార్డులు పరిశీలించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు ఉంటాయన్నారు. గ్రామాల్లో పైపులైన్‌ల లీకేజీలను గుర్తించి వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

పెద్దకొత్తపల్లి వాసికి డాక్టరేట్



పెద్దకొత్తపల్లి: పాలమూరు విశ్వవిద్యాలయంలో దశాబ్ద కాలంగా అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్న ఆదేర్ల కరుణాకర్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ మధుమతి పర్యవేక్షణలో కంప్యూటర్ సెల్ఫ్‌ఎఫికసి, కంప్యూటర్ ఆక్సిటీ అండ్ అటిట్యూడ్ టు వర్డ్స్ బీ లర్నింగ్ అమాంగ్ బీ ఎయిడ్ స్టూడెంట్స్ అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా అందుకున్నారు. కరుణాకర్‌రెడ్డిని పీయూ వీసీ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్‌తో పాటు పెద్దకొత్తపల్లి గ్రామవాసికి డాక్టరేట్ రావడంపై మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, లక్ష్మీకాంత్‌రెడ్డి, రఘుపతిరెడ్డిలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి సత్కారం

కొల్లాపూర్: శ్రీరంగాపూర్ చరిత్ర, సంస్కృతి అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు దాసరి శివుడు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను అందుకున్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని కళాశాలలో ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్‌తో పాటు సహ అధ్యాపకులు శాలువాలు, పూలమాలలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎస్సీ ఉపకులాల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురువ జయరాములు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలో మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ జాబితాలోని ఉపకులాలన్నింటినీ ఎస్సీ(ఏ) గ్రూపులో చేర్చాలన్నారు. సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తెలంగాణ ప్రభుత్వ వాదన వినిపించేందుకు న్యాయవాదిని పంపడం హర్షణీయమన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం స్పందించి పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోపు వర్గీకరణ బిల్లును ఆమోదించాలని కోరారు. సమావేశంలో నాయకులు మాదాసి, మాదారి కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీరయ్య, ఈదన్న, వెంకటస్వామి, శేషయ్య, మల్లయ్య తదితరులున్నారు.

నల్లమల పురోహితుడికి జ్యోతిష్య బ్రహ్మ

అచ్చంపేట రూరల్: పట్టణానికి చెందిన పురోహితుడు మూలమళ్ల కృష్ణమోహన్ జ్యోతిష్య బ్రహ్మ అవార్డు దక్కింది. వసంత పంచమి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజ కళామందిరంలో ఆర్కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ పవర్ ఐకాన్ అవార్డులను అందించారు. సామాజిక సేవ, జ్యోతిష్యంలో భాగంగా కృష్ణమోహన్ హైకోర్టు జడ్జి మధుసూదన్ రావు, ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్తలు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. కార్యక్రమంలో ఆర్కే నిర్వాహకుడు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి: పేదలందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీగా ఉందని విమర్శించారు. ప్రజలకు ఆర్థిక పరిపుష్టి పెంచే విధంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన కొనసాగిందని అన్నారు. రైతుబంధు, రుణమాఫీ ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీ పథకాలను దరఖాస్తు చేసుకోకపోయినా పేదలందరికీ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 13వ తేదీన నిర్వహించబోయే నల్లగొండ సభకు సంబంధించి 12వ తేదీన పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్‌హాలులో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీ రాములు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితో పాటుగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. అనంతరం తన నివాసంలో చలో నల్లగొండ సభ పోస్టరును ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ సర్పంచులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డిలు అన్నారు. శనివారం గ్రామంలో మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని వారిని సన్మానించారు. గ్రామం ఆదర్శం గ్రామంగా తీర్చిదిద్దడంతో మాజీ సర్పంచ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారతమ్మ, ఎంపీడీఓ విజయభాస్కర్, ఏఓ తనూజారాజు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ మహేందర్, మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి, గ్రామస్తులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

అచ్చంపేట రూరల్: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పత్య నాయక్ కోరారు. శనివారం పట్టణంలో ఆర్డీఓ గోపిరాంకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 15న సంత్ సేవాలాల్ జయంతి ఉందని, ఆ రోజు ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బంజారా జాతి అభ్యున్నతి కోసం ఆయన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యుడు శ్రీను నాయక్, గారు, చందులాల్ చౌహాన్, సురేష్ పమార్, కృష్ణ, మహేష్‌నాయక్, దేవేందర్, నరేష్ పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు



తెలకపల్లి: నానోయూరియా వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని రావేఫ్ విద్యార్థులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిన్నముద్దునూర్‌లో పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియాతో నత్రజనిని వివిధ రూపాలలో నష్టపోవడాన్ని తగ్గించవచ్చని సూచించారు. ఆవిరి రూపంలో నత్రజని కొట్టుకుపోకుండా ఉంటుందన్నారు. 80 శాతం నత్రజని వినియోగాన్ని పెంచుకోవచ్చన్నారు. 500 మిల్లీలీటర్ల నానో యూరియా ఒక యూరియ బస్తాకు సమానం అని, గుళికల రూపంలో ఉన్న యూరియా వాడటం వలన 30 నుంచి 40 శాతం నత్రజనిని వినియోగించుకోవచ్చన్నారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు కే సమత, లావన్య, అకిలారెడ్డి, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



చారకొండ: గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి ప్రమీల అన్నారు. మండలంలోని జూపల్లిలో శనివారం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశుద్ధ్యం, నీటి పైప్‌లైన్, మురికి కాల్వల శుభ్రతపై సమస్యలను వివరించారు. గ్రామంలో ఆమె పర్యటించి పరిశీలించారు. ప్రతి ఆదివారం గ్రామంలో మేకల సంతలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శికి అదేశించారు. అనంతరం తహసీల్దార్‌ను వెంకటయ్య యాదవ్, ముస్తాపా, మాజీ వార్డు సభ్యులు జంగయ్య, బాలస్వామి, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

తాడూరు: రోడ్డు నియమ నిబంధనలను వాహనదారులు ఉల్లంఘించొద్దని ఎస్‌ఐ మహేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనదారులు వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను ఈ నెల 15 వరకు చెల్లించేందుకు గడువు ఉందని వివరించారు. ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



ప్యాడ్లు అందజేసిన క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు విద్యా సామగ్రిని క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్, రాజయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకునేవరకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా 10వ తరగతిలో 10/10 సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. క్లాస్‌మెట్ క్లబ్ ప్రతినిధులు శ్యాంసుందర్, పరమేశ్వర్‌ప్రసాద్, వెంకటేష్, అనీల్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుట్టుమిషన్ బహూకరణ

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శనివారం కుట్టుమిషన్ బహూకరించారు. గ్రామానికి చెందిన మోహన్‌రావు పెళ్లి రోజు సందర్భంగా ఆయన సోదరుడు మాజీ ఉపసర్పంచ్ మదన్‌మోహన్‌రావు మిషన్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రమణ, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, నిజాముద్దీన్, మల్లేష్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.